క్లుప్తంగా

కామన్ పీజీ సెట్ రద్దు చేయాల్సిందే



నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల ఐక్య వేదిక నాయకులు

తిరుపతి సిటీ : మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు కామన్ పీజీ సెట్‌ను రద్దు చేయాల్సిందేనని విద్యార్థి సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. వారు గురువారం ఎస్వీయూ పరిపాలనా భవనం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ జాతీయ విద్యావిధానంలో భాగంగానే ఏపీ పీజీ సెట్‌ను నిర్వహిస్తున్నారని, దీంతో వర్సిటీల్లో 40 శాతం మేర ప్రవేశాలు పడిపోయాయని తెలిపారు. వెంటనే కామన్ సెట్‌ను రద్దు చేసి ఆయా వర్సిటీలకు పీజీ సెట్ నిర్వహణను అప్పగించాలని డిమాండ్ చేశారు. కామన్ ఏపీ పీజీ సెట్‌ను వ్యతిరేకిస్తూ తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలని నిర్ణయించినట్లు తెలిపారు. కామన్ సెట్‌ను రద్దు చేయకపోతే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

సుధహాలో ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి ఆర్సీ రోడ్డులోని సుధహా లిటిల్ సిటిజన్స్ హైస్కూల్లో గురువారం అగర్వాల్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు దాదాపు 200 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. కంటి పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, డైరెక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, హెచ్‌ఎం ఎస్.విష్ణు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 55 మంది ఎంపిక



ప్లేస్‌మెంట్ సాధించిన విద్యార్థులతో కళాశాల నిర్వాహకులు

చంద్రగిరి: క్యాంపస్ ఇంటర్వ్యూల్లో తిరుపతి రూరల్‌లోని గొల్లపల్లి సిద్దార్థ ఇంజినీరింగ్ విద్యార్థులు సత్తా చాటారు. 55 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు సెక్రటరీ ఆనందరెడ్డి తెలిపారు. బెంగళూరుకు చెందిన ఆల్ డిజిటెక్ సొల్యూషన్ సంస్థ హెచ్‌ఆర్ టీం గురువారం కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. బీటెక్ ఫైనల్ చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రతిభ చూపిన 55 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు ఆనందరెడ్డి తెలిపారు. వారికి నియామక పత్రాలు సైతం అందజేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ రాజశేఖర్ తదితరులు అభినందించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ డైరెక్టర్ స్వామినాథ్, టీపీఎం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు హాస్టళ్లలో ల్యాప్‌టాప్‌లు చోరీ

చంద్రగిరి: మండలంలోని రామిరెడ్డిపల్లి పంచాయతీలో ఉన్న ప్రైవేటు హాస్టళ్లలో విద్యార్థుల ల్యాప్‌టాప్‌లు చోరీకి గురయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. మోహన్‌బాబు యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతున్న రాఘవేంద్ర, వెంకటేష్, అమరనాథ్, షారున్, దీవన్ కుమార్, నాగశయన రెడ్డి, కౌసిక్ వేర్వేరుగా మూడు ప్రైవేటు హాస్టళ్లలో ఉంటున్నారు. వారు బుధవారం అర్ధరాత్రి వరకు చదువుకుని నిద్రించారు. గురువారం ఉదయం నిద్రలేచి చూడగా ఏడు ల్యాప్‌టాప్‌లు, ఒక సెల్‌ఫోన్ చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మృతదేహాలు అప్పగింత




మృతి చెందిన యమున, ఫక్కీర్ బాషా (ఫైల్)

తిరుపతి రూరల్ : పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రాహదారిపై బుధవారం అర్ధరాత్రి టిప్పర్ ఢీకొని మృతి చెందిన యువతీ యువకుల మృతదేహాలను గురువారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసుల కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం బోరెడ్డివారిపల్లికి చెందిన ఫక్కీర్‌బాషా శ్రీ విద్యానికేతన్ కాలేజీలో బీఎస్సీ నర్సింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. పీలేరు సమీపంలోని రామానాయుడు తండాకు చెందిన యమున తిరుపతి ఎస్వీఎంఎస్ కాలేజీలో బీఎస్సీ నర్సింగ్ రెండో సంవత్సరం చదువుతోంది. వీరు కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. బుధవారం సాయంత్రం పుత్తూరులో జరిగే స్నేహితుడి వివాహానికి వెళ్లారు. అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో తిరిగి వస్తుండగా రామానుజపల్లి చెక్ పోస్టు వద్ద టిప్పర్ ఢీకొంది. ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను పోలీసులు రుయా మార్చురీకి తరలించారు. శవపరీక్ష పూర్తి చేసిన తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అంతరిస్తున్న అడవి కోడి



శేషాచలం అడవులు జీవ వైవిధ్యానికి నిదర్శనం. ఇక్కడ ఎంతో విలువైన ఎర్రచందనం చెట్లతోపాటు వివిధ జీవరాశులు ఉన్నాయి. దేశంలోనే అరుదైన జాతిగా గుర్తింపు పొందిన బూడిదరంగు అడవికోళ్లు ఇక్కడున్నాయి. ఇవి ఒకప్పుడు దేశంలోని ప్రతి అడవిలోనూ ఎక్కువగా ఉండేవి. వాటి మనుగడకు కావాల్సిన పరిస్థితులు లేకపోవడంతో క్రమేపీ అంతరిస్తున్న జాతుల జాబితాలోకి చేరాయి. ఈ క్రమంలో కేంద్రం ఎస్వీ జూ పార్కు కేంద్రంగా అడవి కోళ్లను పునరుత్పత్తి చేయాలని నిర్ణయించింది. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా లక్ష్యం నెరవేదం లేదు.

- అరుదైన జాతిగా బూడిదరంగు అడవి కోడి
- పునరుత్పత్తి కేంద్రం ఏర్పాటైనా ఫలితం శూన్యం
- మీనమేషాలు లెక్కిస్తున్న ఎస్వీ జూపార్కు అధికారులు

తిరుపతి మంగళం : బూడిదరంగు అడవి కోళ్లు (గ్రే జంగిల్ఫోల్) దేశంలోనే కాదు, ప్రపంచంలోనే భూమిమీద సాగిస్తున్న అరుదైన జీవరాశుల్లో ఒకటిగా గుర్తింపు పొందాయి. అంతరించిపోతున్న జాతుల్లోనూ ఒకటిగా అంతర్జాతీయ సంస్థ సైటీస్ రికార్డుల్లోకి ఎక్కింది. అలాంటి బూడిదరంగు అడవికోళ్ల సంఖ్యను పెంచాలని భారత ప్రభుత్వం గతంలో నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలోనే దక్షిణ భారత దేశంలో ఈ జాతి కోళ్లు మనుగడ సాగించేందుకు అనుకూలమైన వాతవరణం కలిగిన అడవులుగా శేషాచలం కొండలను గుర్తించారు. ప్రపంచమంతా అంతరించిపోయినా శేషాచలం అడవుల్లో ఉన్నట్లు తేలింది. దీంతో సెంట్రల్ జూ అథారిటీ ఆధ్వర్యంలో తిరుపతి శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శన శాలలో అడవి కోళ్ల పునరుత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

అనుకున్న ఫలితాలు సాధించలేదు...

సీజెడ్ఏ ఆధ్వర్యంలో 2016లో జూపార్కులో బూడిద రంగు అడవికోళ్ల పునరుత్పత్తి కేంద్రం ఏర్పాటైంది. అంతరించిపోతున్న జాతికి చెందిన కోళ్లను అభివృద్ధి చేయడం ముఖ్య ఉద్దేశం. ఇక్కడ అనుకున్న ఫలితాలు రాలేదు. ఇక్కడ కోళ్లు పెడుతున్న గుడ్లు, గుడ్లను పొదిగే కోళ్లు రెండూ సమస్యగానే మారాయి. గుడ్లను కోళ్లు పొదగలేకపోతుండడంతో గతంలో ఇంక్యుబేటర్లను కూడా ఉపయోగించినా ఫలితం రాలేదు. నిధుల సమస్య లేదు. సీజెడ్ఏ 2018లో కోళ్ల పెంపు, నిర్వహణ కోసం రూ.70 లక్షలు మంజూరు చేసింది. ఆ తర్వాత ఇవ్వలేదు. గతంలో ఇచ్చిన నిధుల్లో ఇప్పటికీ రూ.20 లక్షలు మావద్దే ఉన్నాయి. కోళ్ల సంఖ్య పెంపుపై గతంలో ఏమి జరిగిందో తెలియదు. ఇప్పుడు మేము దృష్టి సారించాం. ఇందులో భాగంగానే కోళ్ల పెంపుపై చెన్నైలోని వెటర్నరీ కళాశాలను సంప్రదించాం. వారి సూచనల మేరకు కోళ్లకు ప్రొటీన్ కంటెంట్ ఎక్కువగా ఉండే ఆహారం అందించేందుకు చర్యలు తీసుకున్నాం.

– సెల్వం క్యూరేటర్, తిరుపతి ఎస్వీ జూపార్కు

ప్రత్యేక సముదాయం ఏర్పాటు

అడవి కోళ్ల పెంపుకోసం 2016 మార్చి 21వ తేదీన జూలో ప్రత్యేకంగా ఒక సముదాయాన్ని నిర్మించారు. 30 ఆడ, మగ అడవి కోళ్లను సేకరించి పునరుత్పత్తిని ప్రారంభించారు. కోళ్లు పెట్టిన గుడ్లను పొదిగించేందుకు సహజ సిద్ధమైన పద్ధతులతోపాటు ఇంకుబేటర్లను కూడా ఉపయోగించారు. వందల సంఖ్యలో గుడ్లను పొదిగిస్తే పదుల సంఖ్యలో కూడా పిల్లలు పుట్టలేదు. అలానే పుట్టిన పిల్లలు కూడా ఏదో ఒక అనారోగ్య సమస్యతో చనిపోతూనే ఉన్నాయి. సముదాయం ఏర్పాటుచేసిన నాటి నుంచి నేటి వరకు వాటి సంఖ్య 50కి మించలేదు. దీనికి గల కారణాలను అన్వేషించి కోళ్ల వృద్ధిని పెంచాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. సీజెడ్ఏ కూడా కేంద్రం నిర్వహణ గురించి పట్టించుకోలేదు. 2018 వరకు నిధులు కేటాయిస్తూ వచ్చిన సీజెడ్ఏ తర్వాత నిధులు ఇవ్వడం మానేసింది. ఇందుకు జూ అధికారుల బాధ్యత కూడా ఉందని కొందరు అటవీశాఖ అధికారులు అంటున్నారు. ఇచ్చిన నిధులతో అభివృద్ధి చేసి చూపిస్తే సీజెడ్ఏ నిధులను విడుదల చేసేదని, అనుకున్న దానికంటే ఫలితాలు తీసికట్టుగా ఉన్న కారణంగానే నిధులను ఆపేసినట్లు అంటున్నారు. అంతేకాకుండా జూ బాధ్యతలను నిర్వర్తించే అధికారులు ఏళ్లుగా పునరుత్పత్తి కేంద్రం గురించి పట్టించుకోవడం మానేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఎస్వీజూలో నిరుపయోగంగా ఉన్న బూడిద రంగు అడవి కోళ్ల పునరుత్పత్తి కేంద్రం

విద్యార్థినుల ఆందోళన



ఎస్వీయూ పరిపాలనా భవనం వద్ద బైఠాయించిన విద్యార్థినులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ మహిళా హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థినులు కోరారు. వారు గురువారం విద్యార్థి సంఘం నాయకులతో కలిసి ఎస్వీయూ పరిపాలనా భవనం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ మహిళా హాస్టల్స్‌లోకి పాములు వస్తున్నాయని వాపోయారు. నాణ్యమైన ఆహారం అందించడం, వాష్‌రూమ్‌లు సరిగా లేవన్నారు. అనంతరం వీసీకి వినతి పత్రం అందజేశారు. స్పందించిన వీసీ మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు నాణ్యమైన ఆహారం అందజేస్తామని హామీ ఇచ్చారు.

ఎంబ్రాయిడరీలో శిక్షణ

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల హోమ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఎంబ్రాయిడరీ ఎంబెలిష్మెంట్స్ టు స్పార్క్ యువర్ క్రియేటివిటీ అనే అంశంపై రెండు రోజుల జాతీయ స్థాయి వర్క్‌షాప్ ప్రారంభమైంది. ప్రిన్సిపాల్ నారాయణమ్మ మాట్లాడుతూ విద్యార్థులకు అకడమిక్ విద్యతో పాటు ఉపాధి రంగాలపై శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఫ్యాషన్ టెక్నాలజీ అధ్యాపకులు టి.దేవి, కె.హబీబ్, వైస్ ప్రిన్సిపాల్ జి.భద్రమణి, ఐఏసీ కన్వీనర్ ఉమారాణి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ విద్యుల్లత, హోమ్ సైన్స్ విభాగాధిపతి వి.లక్ష్మి పాల్గొన్నారు.

టీటీడీని భ్రష్టు పట్టిస్తున్న కూటమి ప్రభుత్వం



మాట్లాడుతున్న వాసుయాదవ్

తిరుపతి కల్చరల్: తిరుమల పుణ్యక్షేత్రాన్ని టీటీడీ పాలక మండలి సభ్యులు భ్రష్టు పట్టిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధులు వాసుయాదవ్, పసుపులేటి సురేష్ విమర్శించారు. విధి నిర్వహణలోనున్న ఉద్యోగి బాలాజీ పట్ల టీటీడీ పాలక మండలి సభ్యుడు వ్యవహరించిన సంఘటనే ఇందుకు నిదర్శనమన్నారు. వారు గురువారం ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. పాలక మండలి సభ్యుడి తీరును వ్యతిరేకిస్తూ ఉద్యోగులు ఆందోళన చేస్తున్నా టీటీడీ యాజమాన్యం, ప్రభుత్వం స్పందించకపోవడం విడ్డూరమన్నారు. శ్రీవారికి తాను ప్రథమ భక్తుడిని, తిరుమలలో గోవింద నామస్మరణ తప్ప మరేమి వినిపించకూడదని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీనిపై ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. సనాతన ధర్మ పరిరక్షణే తన ధ్యేయమని చెప్పిన పవన్‌కల్యాణ్ స్వామి ఎక్కడ దాక్కున్నారని దుయ్యబట్టారు. ధార్మిక క్షేత్రమైన తిరుమలలో నిత్యం శ్రీవారి ఆలయ పవిత్రత గురించి మాట్లాడే టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఒక ఉద్యోగికి జరిగిన అవమానంపై స్పందించకపోవడం విడ్డూరమన్నారు. గతంలో భూమన కరుణాకరరెడ్డి తన హయాంలో అద్వితీయమైన కార్యక్రమాలు నిర్వహించి శ్రీవారి వైభవాన్ని, సనాతన ధర్మాన్ని నలుదిశలా వ్యాప్తి చేశారని గుర్తు చేశారు. ఇప్పటికైనా టీటీడీ యాజమాన్యం, ప్రభుత్వం స్పందించి బోర్డు సభ్యుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బోర్డు సభ్యుడి తీరుకు వ్యతిరేకంగా ఉద్యోగులు చేపట్టే పోరుకు వైఎస్సార్ సీపీ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. నేతలు మురళీ, అనీల్‌రెడ్డి, ఉపేంద్ర, నరేష్ పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు సభ్యుడిని తొలగించాలి



చిట్టిబాబు

తిరుపతి అర్బన్: టీటీడీ ఉద్యోగి బాలాజీని బూతులు తిట్టి బెదిరింపులకు పాల్పడిన టీటీడీ బోర్డు సభ్యుడు నరేష్ కుమార్‌ను వెంటనే తొలగించాలని కాంగ్రెస్ పార్టీ తిరుపతి నగర అధ్యక్షుడు చిట్టిబాబు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రపంచంలో హిందూ ధర్మ పరిరక్షణకు పట్టుకొమ్మలా ఉన్న టీటీడీ పాలక మండలి సభ్యుడిగా ఉన్న వ్యక్తి ఆవేశంతో ఊగిపోతూ ఉద్యోగిపై దురుసుగా ప్రవర్తించడం సరికాదని పేర్కొన్నారు. ఆలయాల పవిత్రతను కాపాడాలని, భక్తులు, ఉద్యోగుల సంక్షేమానికి పాటుపడాలని పాలకులు చెబుతుంటే అందుకు విరుద్ధంగా నరేష్ కుమార్ వ్యవహరించారని ఆరోపించారు.

కిరణ్ కుమార్‌కు డాక్టరేట్



తిరుపతి సిటీ: ఎస్వీయూ ఆక్వా కల్చర్ విభాగపు పరిశోధక విద్యార్థి బి.కిరణ్ కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయన ప్రొఫెసర్ పి.నాగజ్యోతి పర్యవేక్షణలో కాంపెరేటివ్ స్టడీస్ ఆఫ్ ది ఎఫెక్ట్ ఆఫ్ ప్రోబయాటిక్స్ ఆన్ ద గ్రోత్ అండ్ వాటర్ క్వాలిటీ మెయింటెనెన్స్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ ఫిషెస్ పంగాసిఎస్ హైపోథాలమస్ అండ్ పియరక్టస్ బ్రోకైపో మస్ అనే అంశంపై పరిశోధన చేశారు.

వచ్చే నెలలోనే జీతాలు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో వేతనజీవుల అవస్థలు కొనసాగుతునే ఉన్నాయి. నిరసనలకు దిగుతామని నాన్ టీచింగ్ స్టాఫ్ హెచ్చరించడంతో అధికారులు హుటాహుటినా వర్సిటీ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి జనవరి వేతనాలు జమచేశారు. శాశ్వత అధ్యాపకులు, అకడమిక్ కన్సల్టెంట్లు వేతనాలు ఇప్పటికీ జమచేయలేదు. వేతనాల చెల్లింపుల కోసం ఇప్పటికే రూ.37 కోట్ల గ్రాంట్ మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపానలు పంపించారు. ఇంతవరకు స్పందన లేకపోవడంతో అధ్యాపకుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. వచ్చే నెల 10వ తేదీ లోపు రెండు నెలల వేతనాలు చెల్లించవచ్చనే ప్రచారం జరుగుతోంది.

ముక్కోటి ఉత్సవాలు ప్రారంభం

చంద్రగిరి: తొండవాడ స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయంలో గురువారం నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ నెల 28 వరకు శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి తెలిపారు.

ఆగని మట్టి తవ్వకాలు

- చోద్యం చూస్తున్న అధికారులు

తిరుపతి టాస్క్‌ఫోర్స్ : పాకాల మండలంలోని చెరువుల నుంచి మట్టి తవ్వకాలు ఆగడం లేదు. మట్టి అక్రమ రవాణాపై ఫిర్యాదు చేసినా, పత్రికల్లో కథనాలు వచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాకాల మండలం నేండ్రగుంట రైల్వేగేటు సమీపంలో వేస్తున్న వెంచర్‌కు రియల్టర్లు దిగువకుంట చెరువు నుంచి మట్టిని గురువారం యంత్రాలతో అక్రమంగా తరలించారు. సమాచారం అందుకున్న అధికారులు తమ సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపారు. అప్పటికే విషయం తెలుసుకున్న అక్రమార్కులు అక్కడి నుంచి యంత్రాలను పంపించేశారు. అధికారులు ముందుగా వారికి సమాచారం ఇవ్వడం వల్లే వాహనాలను అక్కడి నుంచి తరలించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెరువు నుంచి వందల లోడ్ల మట్టిని వెంచర్‌కు తరలించేశారని చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మట్టి అక్రమ తవ్వకాలను నియంత్రించాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ డీఈఈ చంద్రారెడ్డి సురేష్‌ను వివరణ కోరగా తమ సిబ్బంది అక్కడికి చేరుకునే సమయానికి యంత్రాలు లేవని, త్వరలోనే చెరువును సర్వే చేసి అపోహలను తొలగిస్తామన్నారు. నిజంగా అక్రమాలకు పాల్పడి ఉండే శాఖాపరమై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

పురుషులకూ కుని ఆపరేషన్

తిరుపతి తుడా: ఏర్పేడు మండలానికి చెందిన 40 ఏళ్ల వ్యక్తికి గురువారం కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథి రెడ్డి మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ ఆపరేషన్ ఆడవారికి మాత్రమే అన్న అపోహ నుంచి మగవారు బయటికి రావాలన్నారు. ఈ ఆపరేషన్ ద్వారా మగవారు కూడా చేసుకోవచ్చని అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఆపరేషన్‌ను వైద్య నిపుణులు డాక్టర్ సేపూరి రామమోహన్ రెండు నిమిషాల్లోని పూర్తి చేశారని తెలిపారు. ఇది అతి సూక్ష్మమైనదని, కత్తి, కోత, కుట్టు, గాయము, రక్తస్రావం ఉండవన్నారు. ఈ ఆపరేషన్ చేసుకున్న వ్యక్తి 24 గంటల్లోనే దినచర్య ప్రారంభించవచ్చని, వారం రోజుల్లోనే సంసార జీవితాన్ని తిరిగి ప్రారంభించవచ్చన్నారు.

చంద్రప్రభ వాహనంపై కపిలేశ్వరుడి విహారం



తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం రాత్రి స్వామి వారు చంద్రప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామివారు సూర్యప్రభ వాహనంపై విహరించారు. అనంతరం ఆలయంలో సోమస్కందమూర్తి, శ్రీకామాక్షి అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా చేపట్టారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రేడియేషన్ అంకాలజీపై వర్క్‌షాపు

తిరుపతి తుడా: స్విమ్స్‌లోని పద్మావతి ఆడిటోరియంలో గురువారం రేడియేషన్ అంకాలజీ విభాగం ఆధ్వర్యంలో 'బ్రాకి థెరఫి ది సర్జికల్ బ్రాంచ్ ఆఫ్ రేడియేషన్ అంకాలజీ అనే అంశంపై 7వ వార్షిక చైర్ ఒరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. హర్యానా, ఫరిదాబాద్ సర్వోదయా హాస్పిటల్, రేడియేషన్ అంకాలజీ ప్రొఫెసర్ అశోక్ కుమార్, రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా, రామ్, బీవీ సుబ్రమణియన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి దీప్తి, నాగరాజు, కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ సుధారాణి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 14 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 12 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 72,745 మంది స్వామివారిని దర్శించుకోగా 24,156 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.48 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 14 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

ఫొటోలు తీసి.. మార్ఫింగ్ చేసి

- మార్ఫింగ్ వీడియోలను పోర్న్ సైట్‌లో పెట్టిన యువకుడు
- టెలిగ్రామ్‌లో వీడియోలు పెట్టి డబ్బులు చేసుకున్న మరో యువకుడు

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం జిల్లాలో ఒళ్లు గగుర్పాటు కలిగించే విషయాలు వెలుగు చూశాయి. విద్యార్థినితో చనువు పెంచుకున్న ఓ యువకుడు ఆమె ఫొటోలు, వీడియోలను మార్ఫింగ్ చేసి ఏకంగా పోర్న్ వెబ్ సైట్‌లో పెట్టిన అకృత్యాన్ని పోలీసులు పసిగట్టారు. మరొక యువకుడు ఇలాగే మార్ఫింగ్ వీడియోలను టెలిగ్రామ్‌లో షేర్ చేసి సొమ్ము చేసుకుంటున్న వైనాన్ని కూడా గుర్తించారు. సీఐ పి.ఈశ్వరరావు కథనం మేరకు..

తిరుపతికి చెందిన షేక్ మహ్మద్ సోయెల్‌కు ఓ విద్యార్థినితో పరిచయం ఏర్పడింది. అతను ఆమెతో చనువుగా ఉంటూ ఫొటోలు, వీడియోలు తీసుకున్నాడు. కొన్నాళ్లకు వాటిని న్యూడ్‌గా మార్ఫింగ్ చేశాడు. తెలియని నంబర్ నుంచి ఆమె వాట్సాప్‌కు పంపుతూ లైంగికంగా వేధించడం మొదలుపెట్టాడు. దీనిపై ఆమె ఈ నెల 11న రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ ఈశ్వరరావు విచారణ ప్రారంభించి తిరుపతికి చెందిన షేక్ మహ్మద్ సోయెల్‌గా గుర్తించారు. తిరుపతిలో ఉంటున్న అతనికి నాలుగు రోజుల క్రితం నోటీసులు పంపారు. సోయల్ ఫోన్‌ను క్షుణ్ణంగా పరిశీలించడంతో విద్యార్థిని ఫొటోలు, వీడియోలు వెబ్‌పోర్న్ సైట్‌లో అప్‌లోడ్ చేయడం చూశారు. అవే చిత్రాలు, వీడియోలు ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్‌ల్లో సైతం ఎలా అప్‌లోడ్ అయ్యాయన్నది అర్థం కాక జిల్లా సైబర్ సెల్ బృందాన్ని రంగంలోకి దింపారు. వారు ఇన్‌స్టా గ్రామ్, టెలిగ్రామ్ యాజమాన్యాలకు మెయిల్‌లో ఫిర్యాదు పంపగా వారు ఐడీలు, ఫోన్ నంబర్ పంపించారు. అవి కర్నూలు జిల్లా నందికొట్కూరుకు చెందిన ఉప్పుగళ్ల రఘువిగా గుర్తించి అతనికి నోటీసులు పంపారు. గురువారం రఘు స్టేషన్‌కు రాగా విచారించారు. పోర్న్‌సైట్‌లో వచ్చిన వీడియోలను డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టా, టెలిగ్రామ్‌లలో పెట్టింది తానేనని, తనకు చాలా మంది ఫాలోవర్లు ఉండడంతో వారందరికీ తన ఐఆర్‌కోడ్‌ని లింక్ చేస్తే అమ్మాయిల వీడియోలు వస్తాయని, ఒకసారి లింక్ చేసేముందు తనకు రూ.200 పంపించాలని చెప్పడంతో చాలామంది డబ్బు పంపారని చెప్పారు. విస్తుపోయే నిజాలు తెలియడంతో సీఐ ఈశ్వరరావు గురువారం రాత్రి ఇరువురినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మెకానిక్‌ల సంక్షేమమే లక్ష్యం

తిరుపతి కల్చరల్: మెకానిక్‌ల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తిరుపతి టూవీలర్స్ మెకానిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అవుల మునిరెడ్డి తెలిపారు. గాంధీ భవన్‌లో గురువారం అసోసియేషన్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యులకు వృత్తిపరమైన గుర్తింపు కార్డులు, ప్రమాద బీమా కల్పించామన్నారు. త్వరలో మెకానిక్‌లతో పాటు వారి కుటుంబ సభ్యులకు ఈఎస్ఐ సదుపాయం కల్పించే దిశగా పనిచేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అనారోగ్యంతో బుధవారం మృతి చెందిన గాలివీధికి చెందిన మెకానిక్ రఫీ కుటుంబానికి రూ.20 వేలు అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న మంగళానికి చెందిన మెకానిక్ వేణుకు రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు.

అభివృద్ధి మాది.. ఆడంబరాలు మీవా..?

- తుడా నిధులతో వేసిన బెంచీలకు పసుపు రంగులా
- తప్పుడు కేసు పెడితే ఊరుకోం
- బాధితులను పరామర్శించిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



తగలబడిన పాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న మోహిత్‌రెడ్డి

పాకాల: 'మేము ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయడంతోపాటు పలు అభివృద్ధి పనులు చేశాం. మీరు ఆడంబరాలు చేస్తున్నారు. తుడా నిధులతో వేసిన బెంచీలకు పసుపు రంగులు వేసుకోవడం ఎంతవరకు సమంజసం' అని తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం పాకాల మండలం గానుగపెంట, బందార్లపల్లిలో అక్రమ కేసులు మోపిన బాధితులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ గుడి వద్ద ఉన్న బెంచీలకు పసుపు రంగు వేయవద్దని అన్నందుకు గానుగపెంట ఉపసర్పంచ్ రవిపై కేసు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే అతని పాల సెంటర్‌పై బుధవారం రాత్రి పెట్రోల్ పోసి నిప్పంటించారని ఆరోపించారు. ఆ సమయంలో రవి అక్కడ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. అలాగే బందార్లపల్లిలో బెంచీలకు పసుపు రంగులు వేయవద్దని అడ్డుకున్నందుకు కరుణాకరరెడ్డిపై కేసు పెట్టారని తెలిపారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని సచివాలయానికి వెళ్లిన గ్రామస్తులపై కేసులు పెట్టడాన్ని తప్పుబట్టారు. అందరిపైనా ప్రైవేటు కేసులు పెడతామని హెచ్చరించారు.

చెక్ పవర్ రద్దుకు కుట్ర

తన చెక్ పవర్ తొలగించడానికి టీడీపీ నాయకులు కుట్ర చేస్తున్నారని గానుగపెంట సర్పంచ్ భాగ్యలక్ష్మి వాపోయారు. తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గురువారం ఆమెను పరామర్శించారు. ఆమె మాట్లాడుతూ పనులు చేసినా టీడీపీ నేతలు బిల్లులు కాకుండా చేస్తున్నారని మోహిత్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీ కార్యదర్శి సమక్షంలో చేసిన పనులకు కనీసం రెజల్యూషన్ కూడా ఇవ్వడం లేదని, టీడీపీ నేతలు చెబితేనే ఇస్తానని కార్యదర్శి తెలిపాడన్నారు. మోహిత్ రెడ్డి మాట్లాడుతూ అధికారం శాశ్వతం కాదని, టీడీపీ నేతల మాటలు విని వైఎస్సార్‌సీపీ వారిని ఇబ్బంది పెట్టే ప్రతి ఒక్కరికీ తగిన గుణపాఠం తప్పదన్నారు.



మోహిత్‌రెడ్డితో మాట్లాడుతున్న సర్పంచ్ భాగ్యలక్ష్మి

రాజ్యాంగ బద్ధంగా పనిచేయండి

పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులు రాజ్యాంగ బద్ధంగా పనిచేయాలని, కూటమి నేతల ఒత్తిళ్లకు లొంగిపోయి ఏకపక్షంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. టీడీపీ నాయకులే దాడులు చేసి అక్రమ కేసులు పెట్టడం దారుణమన్నారు. పోలీసులు దగ్గరుండి రంగులు వేయించడం సరికాదన్నారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేరు కనిపించకూడా చేయాలనే ఉద్దేశంతోనే పులివర్తి నాని ఇలాంటి పనులకు పూనుకుంటున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, డీవిజన్ అధ్యక్షులు నంగా కపిలేశ్వర్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, భాస్కర్ నాయుడు, సర్పంచులు భాగ్యలక్ష్మి, నాని, గిరిధర్‌రెడ్డి, యతీశ్వర్‌రెడ్డి, మునిరాజ, రమేష్, బ్రహ్మయ్య, లింగయ్య, విష్ణు, వినాయక, లోకేష్, నాగూర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.